జేపీ దర్గా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

జేపీ దర్గాలో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, డిసెంబర్ 26 : పవిత్ర పుణ్య క్షేత్రమైన జహంగీర్ పీర్ దర్గాను దర్శించుకోవడం ఎంతో అదృష్టమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మండలంలోని హజరత్ జహంగీర్ పీర్ దర్గాలో మంగళవారం ప్రార్థనలు చేశారు. మరికొన్ని రోజుల్లో జరుగనున్న దర్గా ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వక్ఫ్ బోర్డ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దర్గా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, దర్గా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మైనారిటీ నాయకులు అలీఖాన్ బాబర్, ఇబ్రహీం, మసూద్‌ఖాన్, రవి కుమార్ గుప్తా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్యారెంటీలపై దరఖాస్తుల స్వీకరణ

షాబాద్, డిసెంబర్ 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలకు సంబంధించి ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో అనురాధ తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమైందన్నారు. మిగతా ఐదు గ్యారెంటీలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాసం, చేయుత పథకాలకు సంబంధించి ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

యాచారం : మండలంలో గురువారం నుంచి ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న ధర్మన్నగూడ, తులేఖుర్ధు, గడ్డమల్లయ్యగూడ, గున్‌గల్ 29న చౌదర్‌పల్లి, యాచారం, చింతపట్ల, మొండిగౌరెల్లి, 30న అయ్యవారిగూడ, నందివనపర్తి, కేసీతండా, మంథన్‌గౌరెల్లి, 2న మాల్, నల్లవెల్లి, తక్కళ్లపల్లితండా, తమ్మలోనిగూడ, 3న నానక్‌నగర్, తాటిపర్తి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, 4న కుర్మిద్ద, నజ్దిక్‌సింగారం, మల్కీజ్‌గూడ, మేడిపల్లి గ్రామాల్లో ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ప్రజాపాలన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. 27న మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సన్నాహక సమావేశానికి అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆమనగల్లు, డిసెంబర్ 26 : మండలంలోని పలు ఆలయాల్లో మంగళవారం దత్తాత్రేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలకు బారులు తీరారు. పట్టణంలోని సాయిబాబా మందిరంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము దంపతులు యజ్ఞం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాపిశెట్టి కౌసల్య కుమార స్వామి, కళ్యాణి, ఆంజనేయులు, రాములు, రంజిత్ పాండే, సన్యాసి నాయుడు, అర్చకులు నాయనాచారి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

శంకర్‌పల్లి, డిసెంబర్ 26 : పేకాడుతున్న 8 మంది పేకాట రాయుళ్లను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహలింగాపురం మాజీ ఉప సర్పంచ్ వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌వోటీ పోలీసులు, స్థానిక పోలీసులు కలిసి దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 6 కార్లు, 9 సెల్‌ఫోన్‌లు,75 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుభాశ్ పత్రీజీ ఆశయాలను కొనసాగించాలి

ప్రాతఃకాల ధ్యానంలో పాల్గొన్న ధ్యానులు

కడ్తాల్, డిసెంబర్ 26: ధ్యాన గురువు సుభాశ్ పత్రీజీ ఆశయాలను ప్రతి ధ్యాని కొనసాగించాలని పత్రీజీ కుమార్తె పరిమళ పత్రీ, ట్రస్టు చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగాలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల ధ్యానంలో ఆధ్యాత్మిక గురువులు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.

పత్రీజీ చేసిన సేవలు మరవలేనివి

బ్రహ్మర్షీ సుభాశ్ పత్రీజీ సమాజానికి చేసిన ధ్యాన సేవలు మరువలేనివని మై హోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు అన్నారు. కైలాసపురిలో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహాయాగంలో సోమవారం రాత్రి ఆయన పాల్గొని మాట్లాడారు. పత్రీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న ఆయన కుమార్తెలు పరిమళ పత్రీ, పరిణీత పత్రీ కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం పిరమిడ్ ధ్యాన కేంద్రానికి రూ.కోటి విరాళం అందిస్తునట్లు ఆయన ప్రకటించారు. అనంతరం ఆధ్యాత్మిక గురువులు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. అదే విధంగా ధ్యాన యాగంలో ప్రతి రోజు నిర్వహిస్తున్న కళాకారుల నృత్య ప్రదర్శనలు ధ్యానులకు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు హన్మంతరాజు, బాలకృష్ణ, సాంబశివ రావు, శ్రీరామ్‌గోపాల్, దామోదర్‌రెడ్డి, శివప్రసాద్, మాధవి, నవకాంత్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం

పెద్దఅంబర్‌పేట: రావినారాయణరెడ్డి కాలనీలో పార్టీ ఆవిర్భావ వేడుకలో సీపీఐ నేతలు

షాబాద్, డిసెంబర్ 26: పేదల పక్షాన నిలబడి సమస్యలపై పోరాటం చేసేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం కృషి చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సీపీఐ 99వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం షాబాద్, కుర్వగూడ, నాగరకుంట గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, సహాయ కార్యదర్శి రుక్కయ్య, నాగర్‌కుంట ఉప సర్పంచ్ రఘురాం, మండల నాయకులు రాములు, శ్రీశైలం, పాండు, పోచయ్య, నారాయణ, మధు తదితరులున్నారు.

తుర్కయంజాల్ : పార్టీ మున్సిపాలిటీ కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ చౌరస్తాలో ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు శివకుమార్ గౌడ్, కాటం రాజు, అనురాధ, విజయ, పల్లపు శివకుమార్, భాస్కర్, సుందరమ్మ, ఆనంద్, రాజు, ప్రవీణ పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్ : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అధ్యక్షతన ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి జంగయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సుభాన్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు మగ్బూల్, మంజుల పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : పేద ప్రజలకు అండగా ఉండి వారి హక్కుల సాధన కోసం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ర్సింహ ఆధ్వర్యంలో వేడుకలను జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హరిసింగ్‌నాయక్, నాయకులు వేణుగోపాలచారి, యాదగిరి, నారాయణ, చందన, లక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీ పరిధి రావినారాయణరెడ్డి కాలనీలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, సామిడి శేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, దాసరి ప్రసాద్, పొన్నాల యాదగిరి, యేశాల నర్సింహ పాల్గొన్నారు.

ఘనగాపూర్ దత్తాత్రేయుడి సేవలో ఎమ్మెల్యే కాలె యాదయ్య

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, డిసెంబర్ 26: దత్త జయంతి సందర్భంగా మంగళవారం కర్ణాటక రాష్ట్రంలోని ఘనగాపూర్ దత్తాత్రేయ స్వామిని ఎమ్మెల్యే యాదయ్య దర్శించుకున్నారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయం వద్ద దత్త జయంతి సందర్భంగా శంకర్‌పల్లి మండల నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాంరెడ్డి, గోపాల్ తదితరులున్నారు.

ఆదుకోవడమే రాధాకృష్ణ ట్రస్టు లక్ష్యం

కడ్తాల్, డిసెంబర్ 26 : పేదలను ఆదుకోవడమే రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని జడ్పీటీసీ, ట్రస్టు చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నారు. మండలంలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన వడ్ల ఆచారి మృతి చెందాడు. జడ్పీటీసీ మంగళవారం బాధిత కుటుంబానికి రూ.5 వేలు, ఎంపీటీసీ ప్రియ రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిచంద్‌నాయక్, మాజీ ఎంపీపీ సువాలీపంతూనాయక్, మాజీ ఎంపీటీసీ సాయిలు, మాజీ సర్పంచ్ రామకృష్ణ, ఉప సర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు బాబా, కుమార్, రాజు, శ్రీను, జైపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

యాచారం, డిసెంబర్25: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద సోమవారం రాత్రి జరిగింది. సీఐ సైదయ్య తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన కట్టెల నాని (18) అతని సోదరుడు సన్ని (17), అతని స్నేహితుడు విదుర్బాయి మనోహర్ (16) లతో కలిసి మండల కేంద్రంలోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యారు. అనంతరం తిరిగి పల్సర్ వాహనంపై ముగ్గురు స్వగ్రామానికి బయలుదేరారు. ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుకాల నుంచి అతి వేగంగా వచ్చిన ఇన్నోవా వాహనం బైకును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో నాని అక్కడికక్కడే మృతి చెందాడు. సన్ని, మనోహర్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణం ఇన్నోవా కారు డ్రైవర్ నిర్లక్ష్యమని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి : 80966 77665
తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962